ఆదేశిక సూత్రాలు, ప్రాథమిక హక్కుల సంబంధాలు

భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చినప్పటినుంచి ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాల మధ్య ఉన్న సంబంధం వివాదాస్పదంగానే ఉంటోంది. ప్రాథమిక హక్కులను, ఆదేశిక సూత్రాలను రాజ్యాంగంలోని మూడు, నాలుగు భాగాల్లో పొందుపరిచారు. సమాజ సంక్షేమాన్ని ఉద్దేశించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదేశిక సూత్రాల అమలు కోసం అనేక చట్టాలను రూపొందించాయి. కానీ పార్లమెంటు చేసిన చట్టాలు ప్రాథమిక హక్కులకు విరుద్ధంగా ఉన్నాయని, భూసంస్కరణ చట్టాలు రాజ్యాంగ విరుద్ధమైనవని కావడం వల్ల అవి చెల్లవని.. సుప్రీంకోర్టు బీహార్ జమిందారీల రద్దు, బెలాబెనర్జీ వర్సస్ పశ్చిమ బెంగాల్ వంటి అనేక కేసులలో సంచలనాత్మక తీర్పులు ఇచ్చింది. రాజ్యాంగం అమల్లోకి వచ్చిన సంవత్సరం అంటే 1950లోనే మద్రాస్ రాష్ట్ర ప్రభుత్వ మెడికల్ కళాశాలలో బలహీన వర్గాల కోసం కల్పించిన రిజర్వేషన్లు చెల్లవని చంపకం దొరైరాజన్ కేసులో తీర్పునిచ్చింది. ఎం.ఆర్. బాలాజీ వర్సస్ మైసూర్ రాష్ట్రం మధ్య జరిగిన వ్యాజ్యంలో సుప్రీంకోర్టు వెనకబడిన వర్గాలకు కల్పించిన రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదనే తీర్పును వెలువరించింది. 1969లో చేసిన బ్యాంకుల జాతీయీకరణ, 1970లో రాజభరణాల రద్దు చట్టం మొదలైనవి రాజ్యాంగ విరుద్ధమని భారతదేశ సర్వోన్నత న్యాయస్థానం తీర్పునివ్వడం గమనించాల్సిన అంశం.

ఆదేశిక సూత్రాల అమలుకు చట్టాలు రూపొందించాలి. ఈ క్రమంలో రాజ్యాంగంలోని 13వ అధికరణ ప్రకారం ఒకవేళ ప్రభుత్వాలు రూపొందించిన చట్టాలు ప్రాథమిక హక్కులకు విరుద్ధంగా ఉన్నట్లయితే.. ఉన్నత న్యాయస్థానాలు తమ న్యాయసమీక్షాధికారాన్ని వినియోగించి అవి చెల్లవని తీర్పునివ్వొచ్చు. 1967లో గోలక్‌నాథ్ కేసు, 1973లో కేశవానందభారతి కేసు, 1980లో మినర్వామిల్ కేసు, 1992లో ఇందిరాసహానే (మండల్ కేసు) ఈ కోవకు చెందినవే. ఒక దశలో ప్రాథమిక హక్కులు, ఆదేశికసూత్రాల అమలులో తలెత్తిన విభేదాలు పార్లమెంటు, సుప్రీంకోర్టుల మధ్య ఘర్షణకు దారితీసిందని పేర్కొనవచ్చు. బ్యాంకుల జాతీయీకరణ చట్టాన్ని పార్లమెంటు రూపొందించగా, సుప్రీంకోర్టు రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించింది. ఉన్నత న్యాయస్థానం రాజభరణాల రద్దు ప్రాథమిక హక్కులకు వ్యతిరేక చట్టమని ప్రకటించింది. పార్లమెంటు 24, 25, 26 సవరణల ప్రకారం ప్రాథమిక హక్కులపై ఆదేశిక సూత్రాలదే పైచేయి. 42వ రాజ్యాంగ సవరణ ద్వారా ఆదేశిక సూత్రాలను అమలుపరచటంలో పార్లమెంటు రూపొందించే చట్టాలు ప్రాథమిక హక్కులకు భిన్నంగా ఉన్నప్పటికీ.. వాటిని న్యాయస్థానాల ముందు సవాలు చేయకూడదని పేర్కొనడం ద్వారా ఆదేశిక సూత్రాలకు ఇచ్చిన ప్రాధాన్యతను గమనించవచ్చు. సుప్రీంకోర్టు ఈ విషయంలో ఇచ్చిన తీర్పులు కూడా నిశితంగా పరిశీలించదగినవి.

1967లో గోలక్‌నాథ్ కేసులో సుప్రీంకోర్టు తీర్పు ప్రాథమిక హక్కులకు ప్రాధాన్యత ఇచ్చింది. అదే కోర్టు 1973లో కేశవానందభారతి కేసులో నిర్దేశిక నియామాల అమలుకు ప్రాధాన్యత లభించింది. 'ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలు పరస్పర విరుద్ధమైనవి కావు.. పైగా ఈ రెండింటి పునాదులపైనే భారత రాజ్యాంగాన్ని నిర్మించారు. భారత ప్రజాస్వామ్యం అనే బండికి ఈ రెండూ చక్రాల వంటివి. ఈ రెండింటి మధ్యన సమన్వయం, సామరస్యాన్ని నెలకొల్పవల్సిన బాధ్యత రాజ్యాంగ సంస్థల అన్నింటి పైనా ఉంది' అని 1980 మినర్వామిల్ కేసు ద్వారా సుప్రీంకోర్టు పేర్కొంది. 1978 వరకు ఆస్తిహక్కు ప్రాథమిక హక్కుల జాబితాలో ఉంది. అందుకే తరచుగా ప్రాథమికహక్కులు, ఆదేశికసూత్రాల అమలులో సమస్యలు తలెత్తేవి.

ప్రధాన తేడాలు

- ప్రాథమికహక్కులు వ్యక్తి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను దృష్టిలో ఉంచుకొని రూపొందించినవి. ఆదేశికసూత్రాలు సమాజ సమష్టి, విశాల ప్రయోజనాల కోసం ఉద్దేశించినవి.
- ప్రాథమికహక్కులు రాజకీయ ప్రజాస్వామ్యాన్ని సాధించటం కోసం కాగా, ఆదేశిక సూత్రాలు ఆర్థిక, సామాజిక ప్రజాస్వామ్యాన్ని సాధించటం కోసం పొందుపరచినవి.
- హక్కుల అమలు కోసం ప్రత్యేక చట్టాలు అవసరం లేదు. ఎందుకంటే అవి శాశ్వత ప్రాతిపదికపై రూపొందించినవి. కానీ ఆదేశిక సూత్రాల అమలుకు ప్రత్యేక శాసనాలు అవసరం.
- హక్కులు న్యాయ సంరక్షణను కలిగి ఉంటాయి. హక్కుల కోసం న్యాయస్థానాలను ఆశ్రయించవచ్చు. ఆదేశికసూత్రాల అమలు కోసం న్యాయస్థానాలను సంప్రదించలేం. వీటి అమలు ప్రభుత్వాలపైనే ఆధారపడి ఉంటుంది.
- హక్కులలో ఎక్కువ భాగం నకారాత్మక దృక్పథాన్ని కలిగి ఉంటాయి. అంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏ పనులు చేయకూడదో పేర్కొంటాయి. కానీ ఆదేశిక సూత్రాలు సకారాత్మక దృక్పథాన్ని కలిగి ఉండి, ప్రభుత్వాలు ఏ పనులు చేయాలో తెలియజేస్తాయి.
- హక్కుల అమలు కోసం ఆదేశాలు జారీ చేయవచ్చు, ఆదేశిక సూత్రాల అమలు కోసం ప్రత్యేక ఆదేశాలు జారీ చేయలేరు.

ప్రాక్టీస్ ప్రశ్నలు

1. ఆదేశిక సూత్రాల అమలు కోసం పార్లమెంటు న్యాయపరమైన

అడ్డంకులను తొలగించటానికి ఏర్పాటు చేసిన షెడ్యూల్ ఏది?

ఎ) మొదటి బి) 6వ షెడ్యూల్

సి) 9వ షెడ్యూల్ డి) 10వ షెడ్యూల్

2. నిర్దేశిక నియమాల అమలు?

i) ప్రభుత్వ చట్టాలపై ఆధారపడి ఉంటుంది

ii) ప్రత్యేక చట్టాలు అవసరం లేదు

iii) న్యాయస్థానాలు కీలకపాత్ర పోషిస్తాయి

iv) ప్రజాసమ్మతిపై ఆధారపడుతుంది

ఎ) i, ii బి) i

సి) i,ii, & iv డి) i & iii

3. మినర్వామిల్ కేసు ప్రకారం 31(c) అధికరణలకు చట్టబద్ధత ఎప్పుడు లభిస్తుంది?

ఎ) 39 (b) - c అధికరణల అమలు కోసం చట్టాలు చేసినపుడు

బి) ఏ ఆదేశిక సూత్రాన్నయినా అమలు కోసం చట్టాలు చేసినపుడు

సి) ప్రాథమిక హక్కులతో విభేదించినప్పటికీ, ప్రజా సంక్షేమం చట్టంలో ఉన్నప్పుడు

డి) ఆదేశిక సూత్రాల అమలు కోసం చేసిన చట్టాలన్నీ ప్రాథమిక హక్కులకు అనుకూలంగా ఉన్నప్పుడు

4. ప్రాథమిక హక్కులకు, ఆదేశిక సూత్రాలకు మధ్య ఉన్న ప్రధాన వ్యత్యాసం?

i) ప్రాథమిక హక్కులు నకారాత్మకం, ఆదేశికసూత్రాలు సకారాత్మకం

ii) ప్రాథమిక హక్కులకు న్యాయబద్ధత ఉంది, నిర్దేశిక నియమాలకు న్యాయబద్ధత లేదు

iii) ప్రాథమిక హక్కులకు రాజ్యాంగబద్ధత ఉంది, ఆదేశిక సూత్రాలకు రాజ్యాంగబద్ధత లేదు

iv) ప్రాథమిక హక్కులకు, ఆదేశికసూత్రాలకు మధ్య విభేదం వస్తే ప్రాథమిక హక్కులకు ప్రాధాన్యత

ఎ) i, ii, iii బి) i, ii, iv

సి) i, ii, iii & iv డి) i, iii & iv

5. సంపదను సమాజ సంక్షేమ వినియోగించడం కోసం ప్రభుత్వాలు చట్టాలను రూపొందించినపుడు?

ఎ) 9వ షెడ్యూల్‌లో పొందుపరుస్తారు

బి) 14,19 అధికరణలకు విరుద్ధంగా ఉంటే అవి చెల్లనివిగా ప్రకటిస్తారు

సి) ప్రాథమిక హక్కులకు విరుద్ధంగా ఉన్నాయని సుప్రీంకోర్టు కొట్టివేస్తుంది

డి) 14,19 అధికరణలకు విరుద్ధంగా ఉన్నా .. అవి చెల్లనివిగా ప్రకటించరాదు

6. కిందివాటిలో ప్రాథమిక హక్కులకు, ఆదేశికసూత్రాలకు మధ్య విరుద్ధం కాని అంశాలు?

i) ప్రాథమిక హక్కులు వ్యక్తి పరిరక్షణకు ఉద్దేశించినవి, ఆదేశికసూత్రాలు సమాజ సంక్షేమం కోసం ఉద్దేశించినవి

ii) ప్రభుత్వ చర్యలపై ప్రాథమిక హక్కులు ఆంక్షలు, ఆదేశిక సూత్రాలు ప్రభుత్వాలకు మార్గదర్శకాలు

iii) ప్రాథమిక హక్కులు రాజ్యాంగంతో పాటే అమలు జరిగాయి, ఆదేశిక సూత్రాలను తర్వాత చేర్చారు

iv) ప్రాథమికహక్కులు సవరించవచ్చు, ఆదేశిక సూత్రాలు సవరించరాదు

ఎ) i, ii బి) i, ii, iii

సి) i, ii, iii & iv డి) ii & iii

జవాబులు	1	2	3	4	5
	C	B	A	C	D

ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాల మధ్య అనుసంధానం

- 21వ అధికరణ జీవించే హక్కు గురించి చెబుతోంది; 19వ అధికరణ వ్యక్తి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను గురించి వివరిస్తుంది. ఈ రెండు హక్కులను పొందడానికి ఆదేశిక సూత్రాలలోని 39(a) అధికరణ ద్వారా కల్పించే ఉచిత న్యాయ సహాయం జైలులో ఉన్న వ్యక్తులకు తప్పక ఉపయోగపడుతుంది
- పనిహక్కు ఆదేశిక సూత్రాలలో ఉన్నప్పటికీ.. మనిషి జీవించే హక్కుకు అర్థం ఏర్పడాలంటే తగినంత జీవనోపాధిని కల్పించాలని సుప్రీం కోర్టు అనేక సందర్భాలలో పేర్కొంది
- సామాజిక న్యాయాన్ని సాధించడానికి రాజ్యాంగాన్ని సవరించే అధికారం పార్లమెంటుకు ఉంది. దానిలో భాగమే ఆస్తి హక్కును చట్టబద్ధమైన హక్కుగా మార్చడం

ప్రాథమిక విధులు – నైతిక, పౌర బాధ్యతలను తెలిపేవి

భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చిన 26 సంవత్సరాల తరువాత ప్రాథమిక విధులను 42వ రాజ్యాంగ సవరణ ద్వారా IVవ భాగంలోని 51(A) అధికరణలో పొందుపరిచారు. మానవ వ్యక్తిత్వ వికాసానికి హక్కులు ఎంత ముఖ్యమో, సమాజ క్రమబద్ధీకరణకు విధులు అంతే అవసరం. అందువల్లే హెచ్.జె. లాస్కి హక్కులు – విధులు ఒకే నాణేనికి ఇరుపక్కలా ఉండే బొమ్మా-బొరుసు లాంటివి అని అభివర్ణించారు. న్యాయశాఖామంత్రి హెచ్.ఆర్ గోఖలే 1975లో విధించిన జాతీయ అత్యవసర పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని పౌరుల ప్రాథమిక బాధ్యతలను గుర్తుచేయడంలో రాజ్యాంగ విరుద్ధ, తిరుగుబాటు శక్తుల పట్ల తమ వైఖరిని తెలియజేయటానికి ఉద్దేశించినవిగా పేర్కొన్నారు. ఇందిరాగాంధీ ప్రాథమిక విధులను రాజ్యాంగంలో చేర్చటాన్ని సమర్థించారు. వ్యక్తుల నైతిక బాధ్యతలను గుర్తుచేస్తూ.. హక్కుల పట్ల వ్యక్తులకుండే అవగాహన, విధుల పట్ల కూడా ఉండాలని ఆమె పేర్కొన్నారు. స్వరణ్‌సింగ్ కమిటీ సూచనలను అనుసరించి ప్రాథమిక విధులను మన రాజ్యాంగంలో పొందుపరిచారు. 1976లో 10 ప్రాథమిక విధులను చేర్చారు. 2002లో 86వ సవరణ ద్వారా ప్రాథమిక విద్యకు సంబంధించిన అంశాన్ని చేర్చడంతో ప్రస్తుత విధుల సంఖ్య మొత్తం పదకొండుకు చేరింది. 1999లో నియమించిన వర్మ కమిటీ ప్రాథమిక విధుల అమలులో ఉన్న న్యాయపరమైన చట్టాలను గురించి పేర్కొంది.

- భారత రాజ్యాంగాన్ని, జాతీయగీతాన్ని, జాతీయపతాకాన్ని గౌరవించాలి.
- భారత స్వాతంత్ర్యోద్యమ లక్ష్యసాధన కోసం కృషి చేయాలి.
- మన దేశ సార్వభౌమత్వాన్ని ఏకతను, సమగ్రతను సంరక్షించాలి.
- జాతి సంరక్షణ కోసం కంకణబద్ధులై జాతీయ సేవల్లో పాల్గొనాలి.
- భిన్నత్వానికి నిలయమైన భారతీయులలో సోదరభావాన్ని పెంపొందించి, స్త్రీల గౌరవ మర్యాదలకు భంగం కలగకుండా చూడటం.
- ప్రాచీన వారసత్వానికి చిహ్నమైన భారతీయ ఉమ్మడి సంస్కృతిని కాపాడాలి.
- సహజసిద్ధమైన పర్యావరణాన్ని పరిరక్షించటంతో పాటు అడవులను, నదులను, సరస్సులను కాలుష్యం నుంచి సంరక్షించడం.
- శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవడంతో పాటు.. సంస్కరణ పట్ల ప్రోత్సాహ వైఖరిని కలిగి ఉండాలి
- ప్రభుత్వ ఆస్తులను సంరక్షించాలి. హింసను విడనాడాలి
- వ్యక్తిగతంగా, సమష్టిగా అన్ని రంగాలలో ఉన్నతిని సాధించడం
- 6 నుంచి 14 సంవత్సరాలలోపు బాలబాలికలు ప్రాథమిక విద్యను పొందటానికి తల్లిదండ్రులు కృషి చేయడం

ప్రాథమిక విధులు సమగ్రంగా లేవనే విమర్శ కూడా ఉంది. ఓటు హక్కును తప్పక వినియో గించడం, సకాలంలో పన్నులు చెల్లించడం, ప్రాథమిక విధుల నిర్వహణకు అవసరమైన చట్ట బద్ధమైన కట్టుబాట్లను ఏర్పాటు చేయక పోవడం, న్యాయ సంరక్షణ లేకపోవడం వల్ల కేవలం నైతిక విలువలుగానే మిగిలిపోయాయి. వర్మ కమిటీ ఆలోచనల ప్రకారం వీటిని ఉల్లంఘించినపుడు చర్యలు తీసుకునే అవకాశం ఉంది. అటవీ సంరక్షణ చట్టం(1980), వన్యమృగ సంరక్షణ చట్టం (1972), పౌరహక్కుల చట్టం(1986), ప్రజా ప్రాతినిధ్య చట్టం (1951)లను ధిక్కరించినపుడు ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవచ్చు.

ప్రాక్టీస్ ప్రశ్నలు

1.ప్రాథమిక హక్కులకూ, ఆదేశిక సూత్రాలకూ మధ్య సంబంధానికి, ప్రస్తుత స్థితికి సంబంధించి కింది వ్యాఖ్యలలో సరైంది?

ఎ) ఏ సందర్భంలోనూ ప్రాథమిక హక్కుల కంటే ఆదేశిక సూత్రాలకు ప్రాధాన్యం ఉండదు

బి) ఎప్పుడైనా ప్రాథమిక హక్కుల కంటే ఆదేశిక సూత్రాలకే ప్రాధాన్యం ఉంటుంది

సి) ఎప్పుడైనా ఆదేశికసూత్రాల కంటే ప్రాథమిక హక్కులకే ప్రాధాన్యం ఉంటుంది

డి) కొన్ని సందర్భాలలో ప్రాథమికహక్కుల కంటే ఆదేశిక సూత్రాలకే ప్రాధాన్యం ఉండవచ్చు

2.ప్రాథమిక హక్కులపై ఆదేశికసూత్రాలకు ప్రత్యక్షంగా ప్రాధాన్యత కల్పించిన రాజ్యాంగ సవరణ?

ఎ) 4వ సవరణ బి) 17వ సవరణ

సి) 24వ సవరణ డి) 42వ సవరణ

3.మినర్వామిల్ కేసు ద్వారా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఫలితం?

ఎ) ప్రాథమికహక్కులకు ప్రాధాన్యత

బి) ఆదేశిక సూత్రాలకు ప్రాధాన్యత

సి) ప్రాథమికహక్కులు, ఆదేశికసూత్రాల మధ్య సమన్వయం

డి) ఆదేశికసూత్రాలకు, ప్రాథమిక హక్కులకు మధ్య వైరుధ్యం

4.ప్రాథమిక విధులు ఏ రాజ్యాంగం నుంచి గ్రహించారు?

ఎ) ఐర్లాండ్ బి) అమెరికా

సి) పూర్వపు సోవియట్ యూనియన్

డి) బ్రిటన్

5.స్వరణ్‌సింగ్ కమిటీ సూచించిన ఏ విధులను రాజ్యాంగంలో చేర్చ లేదు?

ఎ) విధులను పాటించకపోతే చర్యలు చేపట్టడం, పన్నులు చెల్లించడం

బి) పన్నులు చెల్లించడం, ఓటుహక్కు సద్వినియోగం

సి) విధులను పాటించకపోతే చేపట్టే చర్యలపై ఏ కోర్టులో ప్రశ్నించరాదు, ఓటును సద్వినియోగం

డి) ప్రాథమిక విద్యను పొందటానికి సహకరించుట, ఓటును సద్వినియోగం

6. ప్రాథమిక విధులకు సంబంధించిన వాస్తవిక అంశం కానిది?

ఎ) చట్టరీత్యా చర్యలు లేవు

బి) న్యాయబద్ధతకు అవకాశం లేదు

సి) నైతిక సూచనలు మాత్రమే

డి) పౌరులకు, విదేశీయులకు వర్తిస్తాయి

7.ప్రాథమికవిధులకు,ఆదేశికసూత్రాలకు సారుప్యత లేని అంశం?

ఎ) రెండూ iv భాగంలోనే ఉన్నాయి

బి) రెండింటికీ న్యాయబద్ధత లేదు

సి) రెండూ నైతిక బాధ్యతను తెలుపుతాయి

డి) రెండింటి అమలుకు ప్రత్యేక చట్టాలు అవసరం

8.ఇటీవల ప్రాథమిక విధుల అమలు తీరును పరిశీలించటానికి నియమించిన కమిటీ?

ఎ) షెహనాయ్ కమిటీ బి) వర్మ కమిటీ

సి) వాద్వా కమిటీ డి) లిబర్హన్ కమిటీ

జవాబులు	1	2	3	4	5	6	7	8
	D	D	C	C	A	D	C	B